సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 31 । జనవరి । 2023

ఎస్‌పీఎల్.. ఆట మొదలు..

SAKSHI PREMIER LEAGUE


ఔత్సాహిక క్రీడాకారులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. 8లో..



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి దొండ పాటి వెంకట రామకృష్ణ (రాజమహేంద్రవరం) సోమవారం రూ.1.01.116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 5.970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1.760. మధ్య డెల్టాకు 1.145. పశ్చిమ డెల్టాకు 3.065 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

జాతిపిత సేవలు మరువలేం



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శుక్లా, జేసీ ధ్యానచంద్ర

సాక్షి అమలాపురం: దేశానికి జాతిపిత మహాత్మా గాంధీ అందించిన సేవలు మరువలేమని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. గాంధీజీ 75వ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన జాతిపిత విగ్రహాన్ని కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల అలంకరించి, నివాళి అర్పించారు. జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన కార్యక్రమాలు

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 15 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ శుక్లా తెలిపారు. వచ్చే నెల 13వ తేదీ వరకూ ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆయన, జేసీ ధ్యానచంద్ర, డీఆర్‌ఓ సత్తిబాబు, వైద్యాధికారులు కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ ఎస్‌వీ రవిసాగర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావుదొర, జిల్లా ప్రభుత్వ వైద్యసేవల సమన్వయ అధికారి పద్మశ్రీరాణి, అదనపు డీఎంహెచ్‌ఓ సీహెచ్‌వీ భరతలక్ష్మి పాల్గొన్నారు.

నవోదయ గడువు 8 వరకూ పెంపు

రాయవరం: జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల గడువును పెంచారు. వాస్తవానికి ఈ గడువు మంగళవారంతో ముగిసిపోతోంది. ఈ నేపథ్యంలో దీనిని ఫిబ్రవరి 8వ తేది వరకూ పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఉన్నతాధికారులు ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ జిల్లాలో 1,095 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని సమాచారం. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 4,882 దరఖాస్తులు రాగా, ఈ ఏడాది దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య తక్కువగా ఉండటం గమనార్హం. తల్లిదండ్రుల వినతుల మేరకు జవహర్ నవోదయ విద్యాలయ సమితి గడువు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఇంటర్ ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం

రాయవరం: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 15 నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. వీటికి సన్నాహకంగా సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 7 వరకూ ఈ పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 20 నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అర్ధ సంవత్సర పరీక్షలు డిసెంబర్‌లో నిర్వహించారు. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే ప్రీ ఫైనల్స్ కూడా పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రధానమైన జనరల్ కోర్సుల పరీక్షలు ఫిబ్రవరి 6 వరకూ జరుగుతాయి. జిల్లాలో 12 ప్రభుత్వ, రెండు ఎయిడెడ్, 95 వరకూ ప్రైవేటు జూనియర్ కళాశాలలున్నాయి. సోమవారం సెకండ్ లాంగ్వేజ్, 31న ఇంగ్లిష్, ఫిబ్రవరి 1న గణితం-1ఎ, 1బి, బోటనీ, సివిక్స్, ఒకేషనల్ సబ్జెక్టు-1, 2న గణితం-1బి, జువాలజీ, హిస్టరీ, ఒకేషనల్ సబ్జెక్టు-2, 3న ఫిజిక్స్, ఎకనామిక్స్, ఒకేషనల్ సబ్జెక్టు-3, 4న కెమిస్ట్రీ-1, 2, కామర్స్-1, 2, 7న మోడ్రన్ లాంగ్వేజ్-1, 2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత పేపర్లను మూల్యాంకనం చేసి, ఆ వివరాలు రికార్డుల్లో నమోదు చేస్తారు. ఏ కళాశాలకు ఆ కళాశాలే నూరు శాతం సిలబస్ కవరయ్యేలా ప్రశ్నపత్రాలు తయారు చేసి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రీ ఫైనల్స్ కూడా పబ్లిక్ పరీక్షల మాదిరిగానే పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, ఈ మేరకు ఇప్పటికే ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశామని డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు.


యూటీఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా శిరోమణి



అమలాపురం టౌన్: యూటీఎఫ్ జిల్లా మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా అమలాపురం పట్టణానికి చెందిన పీఎస్ శిరోమణి ఎన్నికయ్యారు. మండపేటలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ నూతన కౌన్సిల్ సమావేశం ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. శిరోమణి 30 ఏళ్లుగా అమలాపురంలో మున్సిపల్ ఉపాధ్యాయురాలిగా పని చేయడంతో పాటు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా, పట్టణ శాఖ అధ్యక్షురాలిగా ఉన్నారు. ప్రస్తుతం స్థానిక సూర్యనగర్‌లోని గోపాలకృష్ణ గోఖలే మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పని చేస్తున్నారు. శిరోమణి ఎన్నికపై యూటీఎఫ్ పట్టణ అధ్యక్షుడు దంగేటి దుర్గారావు, ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ రమణ హర్షం వ్యక్తం చేశారు.

బడుగుల అభ్యున్నతికే జగనన్న చేదోడు

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- 11,419 మంది లబ్ధిదారులకు మూడో విడత నిధుల జమ
- రూ.11.42 కోట్ల మేర ఆర్థిక సాయం



సాక్షి అమలాపురం: అట్టడుగు వర్గాలకు ఆర్థికాభివృద్ధి భరోసా కల్పించాలనే ఉద్దేశంతోనే జగనన్న చేదోడు పథకం ద్వారా ప్రభుత్వం ఏటా రూ.10 వేలు వారి ఖాతాల్లో జమ చేస్తోం దని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. జగనన్న చేదోడు మూడో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా వినుకొండలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లా, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రజకులు, **నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ.10** వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 11,419 మంది లబ్ధిదారులకు రూ.11.42 కోట్ల మేర ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా **వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ ఖాదర్ వలీ, రాష్ట్ర దృశ్య కళల** అకాడమీ, అమలాపురం మున్సిపాలిటీ, డీసీఎంఎస్ చైర్‌పర్సన్లు కుడుపూడి సత్యశైలజ, రెడ్డి సత్య నాగేంద్రమణి, సాకా మణికుమారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు జగనన్న చేదోడు చెక్కు అందిస్తున్న కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్యే చిట్టిబాబు తదితరులు

మూడోసారి వచ్చింది



జగనన్న చేదోడు ద్వారా నాకు వరుసగా మూడో ఏడాది కూడా రూ.10 వేలు వేశారు. మెషీన్ రిపేర్లు, ముడి సరకు కొనుగోలుకు ఈ సొమ్ములు కలిసి వస్తున్నాయి. మావంటి వారికి ఈ సాయం చాలా ప్రయోజనకరం.

– రుద్ర కృష్ణారావు, టైలర్, మామిడికుదురు

వృత్తి నిర్వహణకు 'చేదోడు'



దీర్ఘకాలంగా రజకవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. చేదోడు పథకం కింద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. చెప్పిన సమయానికి ఖాతాకు జమ చేశారు. సీఎం జగన్ సార్ అందించిన సాయాన్ని వృత్తి నిర్వహణకు సద్వినియోగం చేసుకుంటాను. ఆయనకు కృతజ్ఞతలు.

– నంగవరపు శ్రీనివాస్, కపిలేశ్వరపురం

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో కాంస్యం



ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన త్రినాథ్

రాజోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో రాజోలు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్‌ఎస్‌ఎస్‌ఎన్‌కే త్రినాథ్ కాంస్య పతకం సాధించాడు. అతడిని ప్రధానోపాధ్యాయుడు రాయుడు ఉదయ భాస్కరరావు ఆధ్వర్యంలో సోమవారం పలువురు అభినందించారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ కర్నూలులో జరిగిన పోటీల్లో త్రినాథ్ ప్రతిభ చూపి జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు అర్హత సాధించాడని వ్యాయామోపాధ్యాయుడు సీహెచ్‌జీవీఎస్ ప్రసాద్ తెలిపారు.

ఇల వైకుంఠపురంలా..

- లక్ష్మీనృసింహస్వామి కల్యాణానికి ముస్తాబైన అంతర్వేది
- విస్తృతంగా ఏర్పాట్లు
- సుముహూర్తం నేటి రాత్రి 12.46 గంటలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

సఖినేటిపల్లి: సర్వజగద్రక్షకుడైన ఆ ఆది దేవుడు వెలసిన అంతర్వేది పుణ్యక్షేత్రం.. ఇల వైకుంఠపురంలా భాసిల్లుతోంది. సకల శుభాలూ కటాక్షించే శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవానికి ఈ దివ్యధామం ముస్తాబైంది. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా దశమి మంగళవారం రాత్రి 12.46 గంటలకు రోహిణీ నక్షత్రయుక్త తులా లగ్న పుష్కరాంశంలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో స్వామివారి కల్యాణోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించనున్నారు. కల్యాణ మహోత్సవంతో పాటు ఆ మర్నాడు.. అంటే బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు భీష్మ ఏకాదశి పర్వదినాన జరిగే స్వామివారి రథోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు.

కల్యాణ క్రతువు జరగనుందిలా..

- కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన మంగళవారం సాయంత్రం 4 గంటలకు పంచముఖ ఆంజనేయస్వామి వాహనంపై, రాత్రి 8 గంటలకు కంచు గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహిస్తారు.
- రాత్రి ఎదురు సన్నాహంతో కల్యాణ మండపం వద్ద కల్యాణ క్రతువు ఆరంభమవుతుంది.
- వరుడిగా దర్శనమివ్వనున్న నరసింహస్వామి వారి తరఫున పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్.. వధువుల తరఫున దేవస్థానం అర్చక స్వాములు ఎదురు సన్నాహ వేడుకలో పాల్గొంటారు.
- అనంతరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు పర్యవేక్షణలో వధూవరులను వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు కల్యాణ మండపానికి తోడ్కొని వస్తారు. తదనంతరం కల్యాణోత్సవానికి శ్రీకారం చుడతారు.
- రాజా బహద్దూర్, దేవదాయ శాఖ, ప్రభుత్వ ప్రతినిధిగా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ మధుపర్కాలు సమర్పిస్తారు.
- సుముహూర్త సమయానికి స్వామివారి శిరస్సుపై ప్రధానార్చకుడు శ్రీనివాస్ కిరణ్.. శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల శిరస్సులపై సహాయ అర్చకులు జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉంచుతారు. పాణిగ్రహణానంతరం కన్యాదానం జరుగుతుంది.
- ఆనవాయితీగా పశ్చిమ గోదావరి జిల్లా పాలమూరు వాస్తవ్యులు తలంబ్రాలతో పాటు, మంచి ముత్యాలు, పగడాలు, పసుపు కుంకుమలు అందజేస్తారు.
- వీటిలో బంగారు మంగళసూత్రాలు, వెండి ఉత్తర జంధ్యాలకు అర్చకులు వేదమంత్రాలతో పూజలు చేసి, అనంతరం అమ్మవార్లకు మంగళసూత్రధారణ గావిస్తారు.
- ముందుగా స్వామి, అమ్మవార్ల శిరస్సులపై అర్చకులు తలంబ్రాలు వేస్తారు. తరువాత రాజా బహద్దూర్, పాలమూరు రాజులు తలంబ్రాలను స్వామి, అమ్మవార్ల పాదాల చెంతన ఉంచుతారు. బ్రహ్మముడి వేసి, చమ్కీ పూలదండలు సమర్పిస్తారు. మంగళహారతులు ఇచ్చి కల్యాణ మూర్తులకు అర్చకులు ఆశీర్వచనాలు పలకడంతో కల్యాణ క్రతువు ముగుస్తుంది.
- స్వామి, అమ్మవార్లకు అన్నవరం, తిరుపతి దేవస్థానాల నుంచి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ వస్తోంది.
- కల్యాణ మహోత్సవం అనంతరం బుధవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయంలో స్వామి, అమ్మవార్ల దర్శనం యథాతథంగా కొనసాగుతాయని ప్రధానార్చకుడు శ్రీనివాస్ కిరణ్ తెలిపారు.



విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న అంతర్వేది ఆలయం



అభయ ముద్రతో శ్రీలక్ష్మీనృసింహస్వామి



గరుత్మంతునికి అర్చకుల పూజలు



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు



భక్తుల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు



బందోబస్తుకు చేరుకున్న పోలీసు అధికారులు



తీర్థంలో ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వ్యవస్థ

హెల్ప్‌లైన్ నంబర్లు

టూరిజం	08862 – 221500
కమాండ్ కంట్రోల్ :	
పోలీసు :	100
సఖినేటిపల్లి ఎస్సై :	94407 96566
రాజోలు సీఐ :	94407 96526
తహసీల్దార్ :	98499 03893
వీఆర్‌ఓ :	97018 35669
ఎంపీడీఓ :	89787 92099
కార్యదర్శి :	80740 18776
డాక్టర్ యూనస్ :	83286 58482
మెడికల్ ఆఫీసర్ :	87922 57516
స్వామి :	77802 35621
సారథి :	94403 42192
పాపారావు :	91774 90400
రాజోలు ఆర్టీసీ ఎంక్వైరీ	: 08862 – 221057
రాజోలు ఆర్టీసీ డీఎం :	99592 25538
రాజోలు ఎక్సైజ్ :	97047 79056

వన్‌వే అమలు

అంతర్వేది తీర్థం సందర్భంగా వాహనాల రాకపోకలకు పోలీసులు ఎప్పటిలాగానే వన్‌వే అమలు చేస్తున్నారు. అంతర్వేదికి వచ్చే వాహనాలు టేకిశెట్టిపాలెం వద్ద ప్రధాన రహదారిలో కేశవదాసుపాలెం మీదుగా క్షేత్రానికి చేరుకోవచ్చు. తిరుగు ప్రయాణంలో ఆలయం వెనుకవైపు ఏటిగట్టు మీదుగా గొంది, గుడిమూల, సఖినేటిపల్లి సెంటర్ మీదుగా మలికిపురం, రాజోలు తదితర ప్రాంతాలకు వెళ్లవచ్చు. భక్తుల వాహనాలకు గుర్రాలక్క గుడికి సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఆ వాహనాలు గుర్రాలక్క గుడి మీదుగా ఉన్న దండుపుంత మార్గంలో అంతర్వేదికర వద్ద మలుపు తిరిగి, గంగయ్య వారధి మీదుగా సఖినేటిపల్లి మూడు తూముల సెంటర్ వద్ద ప్రధాన రహదారి పైకి చేరవచ్చు.

భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం

అంతర్వేది బీచ్, సాగర సంగమం వంటి అత్యంత కీలక ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీలు వై.మాధవరెడ్డి, కేవీ రమణ పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ స్థాయిల్లో 1,500 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించారు.

ఆరుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 100 మంది ఎస్సైలు, 1,200 మంది కానిస్టేబుల్స్, మరికొంత మంది హోంగార్డులు ఈ విధులు నిర్వహిస్తారు. బీచ్ వద్ద భక్తుల రక్షణకు మత్స్యశాఖ ఆధ్వర్యాన గజ ఈతగాళ్లను, స్పీడ్ బోట్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఫ్లడ్‌లైట్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు.

కమాండ్ కంట్రోల్ రూం

భక్తుల భద్రతకు, అత్యవసర సమయాల్లో కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా ఉండటానికి టూరిజం గెస్ట్‌హౌస్ వద్ద ఉన్నతాధికారులు కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ సమన్వయంతో 135 సీసీ కెమెరాలు, వాకీటాకీలు ఏర్పాటు చేస్తున్నారు. అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పటిష్ఠ నిఘా పెడుతున్నారు. దీనివలన తీర్థంలో ఎక్కడ ఏ మూల చిన్న సంఘటన జరిగినా అధికారులకు తక్షణం సమాచారం చేరుతుంది. కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదేశాలపై డీఎస్పీ వై.మాధవరెడ్డి, ఆర్‌డీఓ ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు సూచనల మేరకు ఈ ఏర్పాట్లు చేశారు.



కల్యాణ వేదిక వద్ద చకచకా ఏర్పాట్లు

ప్రత్యేక శ్రద్ధతో అర్జీల పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం
- స్పందనలో 158 అర్జీల స్వీకరణ

అమలాపురం రూరల్: స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధతో, పూర్తి నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని కలెక్టరేట్ స్పందన హాలులో సోమవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎం.ధ్యానచంద్ర, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబుతో కలిసి కలెక్టర్ శుక్లా.. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి 158 అర్జీలు స్వీకరించారు. వాటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆయా శాఖల జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తునూ నిశితంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్దేశిత గడువు లోగా అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని అన్నారు. ఒకే అంశంపై మళ్లీమళ్లీ దరఖాస్తులు రాని విధంగా పరిష్కరించాలని సూచించారు. అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు తమ పరిధిలోని గ్రామ సచివాలయాలను సందర్శించి, పథకాలు, ఇతర అంశాలపై సిబ్బందికి అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏపీఎంపై ఫిర్యాదు

అయినవిల్లి ఏపీఎం అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆ మండల వీఓఏలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరపాలని డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్‌ను కలెక్టర్ శుక్లా ఆదేశించారు.



స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పోలీసు స్పందనకు 30 అర్జీలు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన కార్యక్రమానికి 30 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. కొన్ని ఫిర్యాదులను ఎస్పీ అక్కడిక్కడే పరిష్కరించి, ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. వచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా ఆస్తి వివాదాలు, కుటుంబ తగదాలే ఉన్నాయి. మధ్యాహ్నం వరకూ స్పందన నిర్వహించిన ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆ తర్వాత అంతర్వేది ఉత్సవాల బందోబస్తు పర్యవేక్షణకు బయలుదేరి వెళ్లారు.

తపాలా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

అమలాపురం టౌన్: గ్రామీణ తపాలా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అమలాపురం పోస్టల్ డివిజన్‌లో మూడు కేటగిరీలు కలిపి మొత్తం 62 పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు సూపరింటెండెంట్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. డివిజన్‌లో 20 బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్, 26 అసిస్టెంట్ బ్రాంచి పోస్ట్‌మాస్టర్, 16 డాక్ అదాలత్ సేవక్ పోస్టులను భర్తీ చేయనున్నామని వివరించారు. అర్హులైన వారు www.indiapostgdsonline.gov.in వైబ్‌సైట్ ద్వారా ఫిబ్రవరి 16లోగా దరఖాస్తు చేసుకోవాలి.

క్లుప్తంగా

కాలభైరవునికి వెండి ఆభరణాలు



వెండి ఆభరణాలు ఊరేగింపుగా తీసుకువస్తున్న సంఘ సభ్యులు



తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సుబ్బారాయుని దిమ్మ సెంటర్‌లోని కాలభైరవస్వామి ఆలయానికి శ్రీ గణేష్ మహాలక్ష్మి చేపల వర్తక సంఘం సభ్యులు 110 మంది కలిసి రూ.6.50 లక్షలతో 6.900 కిలోల వెండి ఆభరణాలను సోమవారం సమర్పించారు. వీటిని స్థానిక గుడ్డివానితూము సెంటర్ నుంచి కుటుంబ సమేతంగా ఊరేగింపుగా తీసుకువచ్చారు.

విద్యాభివృద్ధి ఒప్పందాలతో మేలు



ఎంఓయూ చేసుకుంటున్న వీసీ ప్రసాదరాజు, సిలికానాంధ్ర ప్రోవోస్ట్ రాజు చామర్తి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): దేశాల మధ్య విద్యాభివృద్ధి ఒప్పందాలతో ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని జేఎన్‌టీయూకే ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. జేఎన్‌టీయూకే ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యాన అమెరికా కాలిఫోర్నియా యూనివర్సిటీ సిలికానాంధ్ర, జేఎన్‌టీయూకే మధ్య సోమవారం ఎంఓయూ జరిగింది. ఈ ఒప్పందం ద్వారా ఉమ్మడి ప్రాజెక్టులు, పరిశోధనలు, ఫ్యాకల్టీ, స్టూడెంట్స్, స్టడీ టూర్స్, షార్ట్ కోర్సులు చేయడానికి పరిశ్రమల సహకారంతో జాయింట్ ఎంఎస్ ప్రోగ్రామ్‌లకు వీలుంటుందని వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ రమణ, సిలికానాంధ్ర ప్రోవోస్ట్ రాజు చామర్తి, చైర్మన్ వేణుగోపాల్, రిజిస్ట్రార్ సుమలత, ఇంక్యుబేషన్ సెంటర్ సలహాదారు జీవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్స్ వాలీబాల్ రిఫరీగా జార్జి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అస్సాం రాష్ట్రం గౌహతిలో వచ్చే నెల 2 నుంచి 9వ తేదీ వరకూ జరిగే సీనియర్ పురుషులు, మహిళల జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు రిఫరీగా రాష్ట్ర వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎల్.జార్జి నియమితులయ్యారు. ఈ మేరకు పోటీల నిర్వాహకుల నుంచి సోమవారం నియామక పత్రాలు అందుకున్నారు. జార్జిని జిల్లా వ్యాయమోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రవిరాజు, కోశాధికారి నూకరాజు, వాలీబాల్ సంఘం అధ్యక్షుడు రవిరాజు అభినందించారు.

ఎస్‌పీఎల్.. ఆట మొదలు..

- ఘనంగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం
- గైట్‌లో ప్రారంభించిన 'తూర్పు' జేసీ తేజ్‌భరత్
- కాకినాడలో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు చేతుల మీదుగా శ్రీకారం
- 'సాక్షి'కి అధికారుల అభినందనలు



గైట్‌లో ఎస్‌పీఎల్ పోటీలను ప్రారంభిస్తున్న జేసీ తేజ్‌భరత్



మొదటి మ్యాచ్ విజేత మదర్స్ డిగ్రీ కళాశాల జట్టు



రెండో మ్యాచ్ విజేత గైట్ కళాశాల జట్టు



బౌలింగ్‌తో ఆకట్టుకున్న జేసీ తేజ్‌భరత్

రాజానగరం: ఔత్సాహిక క్రీడాకారులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన రాజానగరం సమీపంలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలోను, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలోను ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. రాజానగరం గైట్ కళాశాలలో జరుగుతున్న పోటీలను తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, మానసికోల్లాసంతో పాటు మేధోసంపత్తి వృద్ధి చెందుతుందని అన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, విషెస్ చెప్పారు. అనంతరం పోటీలను ప్రారంభించి, బ్యాటింగ్, బౌలింగ్‌లో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించి, క్రీడాకారుల హర్షధ్వానాలు అందుకున్నారు. క్రీడలను, గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపడుతున్న 'సాక్షి' మీడియా గ్రూప్‌కు అభినందనలు తెలిపారు. పోటీల గురించి 'సాక్షి' రీజినల్ మేనేజర్లు రమేష్ రెడ్డి (అడ్మిన్), కొండలరావు (ప్రకటనల విభాగం) వివరించారు. నాకౌట్ పద్ధతిలో పది ఓవర్ల పరిమితితో జరిగే ఈ పోటీల్లో రోజుకు ఆరు మ్యాచ్‌లు జరగనున్నాయి. కార్యక్రమంలో యాడ్స్ అసిస్టెంట్ మేనేజర్ ఉమాశంకర్, గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజం, గైట్ కళాశాల ప్రతినిధులు, 'సాక్షి' సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా పోటీలు

- ప్రారంభ మ్యాచ్ మదర్స్ డిగ్రీ కళాశాల (కోటనందూరు), రైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన రైట్ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన మదర్స్ కళాశాల 10 ఓవర్లలో ప్రత్యర్థికి 97 పరుగుల లక్ష్యాన్నిచ్చింది. ఈ టీమ్‌లో సీహెచ్ సతీష్ 17 బంతులకు 4 ఫోర్లు కొట్టి, 24 పరుగులు తీశాడు. పి.లోవరాజు 16 బంతులకు 3 ఫోర్లతో 23 పరుగులు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన రైట్ కళాశాల జట్టు 45 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. 'మదర్స్' జట్టు విజేతగా నిలిచింది. బౌలింగ్‌లో రైట్ కళాశాలకు చెందిన ఎస్‌కే తోహా 2 ఓవర్లలో 20 పరుగులు మాత్రమే ఇచ్చి, మూడు వికెట్లు పడగొట్టాడు. ఎస్.నాగబాబు 23 పరుగులు ఇచ్చి, 2 వికెట్లు తీసుకున్నాడు.
- గైట్ కళాశాల జట్టుకు, రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియో కళాశాల జట్టుకు మధ్య మరో పోటీ జరిగింది. టాస్ గెలిచిన అల్లు కళాశాల జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి, నిర్ణీత ఓవర్లలో 74 పరుగులు చేసింది. శివ 12, మోసి 15 చొప్పున పరుగులు చేశారు. బౌలింగ్‌లో గైట్ టీమ్‌లోని కిరణ్ 2 ఓవర్లకు 6 పరుగులు ఇచ్చి, మూడు వికెట్లు తీసుకుని కీలకంగా నిలిచాడు. మనోజ్ 2 వికెట్లు పడగొట్టాడు. తరువాత బ్యాటింగ్ చేసిన గైట్ కళాశాల జట్టు 8.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని సాధించి విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ జట్టులో రాకేష్ 13 బంతులకు 17 పరుగులు చేసి, నాటౌట్‌గా నిలిచాడు. కెప్టెన్ వరప్రసాద్ 11 బంతులకు 11 పరుగులు చేయడం విశేషం. ప్రత్యర్థి జట్టుకు చెందిన కిషోర్ బౌలింగ్‌లో 2 వికెట్లు తీసుకున్నా విజయం పొందలేకపోయారు.
- రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, రాజానగరం దివ్య కళాశాల జట్ల మధ్య కూడా మరో పోటీ ఆసక్తికరంగా జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్‌కేవీటీ కళాశాల జట్టు 10 ఓవర్లకు 2 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసి, ప్రత్యర్థికి భారీ లక్ష్యం ఇచ్చింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దివ్య కళాశాల జట్టు 10 ఓవర్లలో 75 పరుగులు మాత్రమే చేసి, 53 పరుగుల తేడాతో ఓటమి పొందింది. విజయం సాధించిన ఎస్‌కేవీటీ కళాశాల జట్టులో ఎస్.రాజకుమార్ 35 బంతులకు 97 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 17 ఫోర్లు (ఒకే ఓవర్‌లో ఆరు బంతులకు ఆరు ఫోర్లు), ఒక సిక్స్ కొట్టి టీమ్ విజయానికి విజయానికి తోడ్పడ్డాడు. వర నాని 3 ఫోర్లు కొట్టి 22 పరుగులు చేశాడు.
- ఈ పోటీలకు అంపైర్లుగా కె.అంజనీకుమార్, కె.దినేష్‌కుమార్, స్కోరర్‌గా జి.రవితేజ వ్యవహరించారు.



మూడో మ్యాచ్ విజేత ఎస్‌కేవీటీ కళాశాల జట్టు

క్రీడాస్ఫూర్తితో రాణించాలి



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్ బాబు. చిత్రంలో రిఫ్రెష్‌మెంట్స్ స్పాన్సరర్ హరీష్



ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ తదితరులు



రెండో మ్యాచ్ విజేత సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు



మూడో మ్యాచ్ విజేత జేఎన్‌టీయూకే జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, ఏదెలా ఉన్నా క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని రాణించాలని కాకినాడ జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు అన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలో ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ స్థాయి నుంచే క్రికెట్‌కు మంచి ఆదరణ ఉందని అంటూ 'సాక్షి'ని అభినందించారు. పోటీల రిఫ్రెష్‌మెంట్స్ స్పాన్సరర్, హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు క్రీడాకారులను పరిచయం చేసుకుని, క్రికెట్ ఆడి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకూ జరిగే ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో క్రికెట్ కోచ్ చార్లి, 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి ఎల్.శ్రీనివాసరావు, యాడ్స్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, 'సాక్షి' సిబ్బంది పాల్గొన్నారు.

తొలి రోజు విజేతలు వీరే..

- తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. అజయ్ 19 పరుగులు చేశాడు. 108 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు 9 ఓవర్లలో 101 పరుగులు చేసి 7 వికెట్లు కోల్పోయింది. 7 పరుగుల తేడాతో కిట్స్ జట్టు విజయం సాధించింది.
- రెండో మ్యాచ్‌లో పీఆర్‌జీ కళాశాల జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన ఆదిత్య ఇంజినీరింగ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల కోల్పోయి 87 పరుగులు చేసింది. బ్యాట్స్‌మన్ పోలీస్ 32 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పీఆర్‌జీ జట్టు 6 వికెట్లు కోల్పోయి 82 పరుగులు మాత్రమే చేసింది. 6 పరుగుల తేడాతో ఆదిత్య ఇంజినీరింగ్ జట్టు విజయం సాధించింది.
- మూడో మ్యాచ్‌లో జేఎన్‌టీయూకే, ఐడియల్ కళాశాల జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచిన ఐడియల్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన జేఎన్‌టీయూకే జట్టు 8 వికెట్లు కోల్పోయి 10 ఓవర్లలో 102 పరుగులు చేసింది. చరణ్ 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఐడియల్ జట్టు 79 పరుగులు చేసి, 10 వికెట్లు కోల్పోయింది. 23 పరుగుల తేడాతో జేఎన్‌టీయూకే జట్టు విజయం సాధించింది. మ్యాచ్‌లను క్రికెట్ కోచ్ చార్లీ పర్యవేక్షించారు.

కాంట్రాక్టు లెక్చరర్ల నూతన కార్యవర్గం



కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

రాయవరం: కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని ఉపాధ్యక్షుడు కె.శివనారాయణ సోమవారం రాయవరంలో విలేకర్లకు తెలిపారు. రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ పాలపర్తి కుమార్‌రాజు (రాజోలు), జీవీవీ సత్యనారాయణ (కొత్తపేట), కోశాధికారిగా జె.గోవిందు (ఆలమూరు), ఉపాధ్యక్షులుగా కె.వెంకటరెడ్డి (రామచంద్రపురం), ఎ.రామసత్యనారాయణ (రావులపాలెం), ఎంవీవీ సత్యనారాయణ (కొత్తపేట), జాయింట్ సెక్రటరీలుగా వి.చిరంజీవి, ఎ.నాగరాజు (కొత్తపేట), మహిళా కార్యదర్శులుగా ఎ.మంగతాయారు (కేశనపల్లి), కె.అరుణ(అమలాపురం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు. ఒప్పంద అధ్యాపకుల సర్వీసును 12 నెలలకు పొడిగించాలని ఈ సందర్భంగా శివనారాయణ ప్రభుత్వాన్ని కోరారు.

హంస వాహనంపై అరుదెంచిన స్వామి

- రాత్రి శేష వాహన సేవ
- మూడో రోజూ కన్నుల పండువగా గ్రామోత్సవాలు



హంస వాహనంపై గ్రామోత్సవం

సఖినేటిపల్లి: పాలనురుగులాంటి తెల్లని హంస వాహనంపై అరుదెంచిన స్వామివారిని కన్నులారా వీక్షించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగితేలారు. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం సాయంత్రం హంస వాహనంపై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు. అలాగే రాత్రి శేష వాహనంపై కూడా స్వామివారి గ్రామోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

వాస్తుపూజ, అంకురార్పణ

కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చక స్వాములు విశేష కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత స్వామివారి సన్నిధిలో పుణ్యాహవాచనం, వాస్తుపూజ, గరుత్మంతుని హోమం, అంకురార్పణ, గరుత్మంతుని చిత్రపటం ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు చేశారు.

ఏడు రోజుల పాటు విష్ణుదీక్ష

ఉత్సవాల నిర్వహణకు అర్చకులు మంగళవారం నుంచి పౌర్ణమి వరకూ ఏడు రోజుల పాటు విష్ణు దీక్ష తీసుకున్నారు. ఏటా ఈ దీక్ష చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. అర్చకులకు దీక్షావస్త్రాలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్ అందజేశారు. దీక్ష తీసుకున్న అర్చకులు భక్తిశ్రద్ధలతో అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహించారు. నవధాన్యాలను పుట్టమట్టిపై చల్లి, సర్వ దేవతలనూ ఆవాహన చేసి, ఏడు రోజుల పాటు అర్చనకు శ్రీకారం చుట్టారు. ఈ నవధాన్యాల నుంచి మొక్కలు ఎంత ఏపుగా ఎదిగితే అంత మేర గ్రామాలు పాడిపంటలతో సుభిక్షంగా ఉంటాయని చెబుతారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలకు సకల దేవతలనూ గరుత్మంతుని ద్వారా ఆహ్వానిస్తూ ధ్వజస్తంభంపై ధ్వజపటం ఎగుర వేయడమే ధ్వజారోహణ అని ప్రధానార్చకుడు శ్రీనివాస్ కిరణ్ తెలిపారు. కల్యాణ మహోత్సవాలకు దుష్టశక్తుల వల్ల ఎటువంటి అవరోధాలూ లేకుండా ఉండేందుకు కూడా ధ్వజారోహణ చేస్తామని చెప్పారు. ధ్వజస్తంభానికి మామిడాకులు, దర్భలు కట్టి, గరుత్మంతుని చిత్రం గీసిన వస్త్రాన్ని అర్చకులు ఎగురవేశారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు





తీవ్రంగా గాయపడిన గిరిధర్, విజయలక్ష్మి

- దంపతులకు తీవ్రగాయాలు
- భర్త పరిస్థితి విషమం



బస్సు చక్రాల కింద ఉన్న బైక్

యానాం: స్థానిక బైపాస్ రోడ్డులో సోమవారం మోటార్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. యానాం ట్రాఫిక్ ఎస్సై పువ్వల వీరభద్రస్వామి కథనం ప్రకారం.. యానాం పట్టణ పరిధిలోని యర్రా గార్డెన్స్‌కు చెందిన దూడల సత్యసాయి గిరిధర్, ఆయన భార్య వీర వెంట విజయలక్ష్మి కలిసి మోటార్ సైకిల్‌పై తాళ్లరేవు మండలం పిల్లంక గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. స్థానిక భీమ్‌నగర్ నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద వారి బైక్‌ను విశాఖపట్నం నుంచి అమలాపురం వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ హైవే ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌తో సహా బస్సు ముందు భాగంలోని ఎడమ చక్రం కిందకు గిరిధర్, విజయలక్ష్మి దంపతులు వెళ్లిపోయారు. డ్రైవర్ సడన్ బ్రేకు వేయడంతో బస్సు ఆగి, ప్రమాద తీవ్రత తగ్గింది. రక్తపు మడుగులో ఉన్న భార్యాభర్తలను స్థానికులు హుటాహుటిన అంబులెన్సులో యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం, క్షతగాత్రులను కాకినాడ అపోలో ఆస్పత్రికి తరలించారు. భార్య విజయలక్ష్మి కోలుకుంటున్నారు. తలకు బలమైన గాయమవడంతో భర్త గిరిధర్ పరిస్థితి విషమంగా ఉంది. గిరిధర్ స్థానిక సీతారామనగర్‌లో ఒక ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఇటీవలి వరకూ విజయలక్ష్మి ఒక ప్రైవేటు స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో క్షతగాత్రులకు సహాయం అందజేసేందుకు స్థానిక నాయకుడు గొల్లపల్లి వీర్రాజును పంపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీరభద్రస్వామి తెలిపారు. వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, గిరిధర్ హెల్మెట్ ధరిస్తే తలకు గాయం కాకుండా రక్షణ పొందేవారని అన్నారు.

రాత్రి కూడా నిత్యాన్నదానం

- డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో భక్తుల విజ్ఞప్తి
- కమిషనర్ ఆదేశాల మేరకే చర్యలు
- అన్నవరం దేవస్థానం ఈఓ సత్యనారాయణమూర్తి

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో రాత్రి వేళ కూడా భక్తులకు ఉచిత భోజనం లేదా ఫలహారం ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు కోరారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్‌వీ సత్యనారాయణమూర్తి సోమవారం డయల్ యువర్ ఈఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగతాయారు (అవిడి), కృష్ణవేణి (బూరుగుపూడి) పైవిధంగా కోరారు. దీనిపై ఈఓ సత్యనారాయణమూర్తి స్పందిస్తూ రాత్రి వేళ బస చేసేవారు తక్కువగా ఉంటారని చెప్పారు. పగటి వేళ సాయంత్రం 4 గంటల వరకూ కూడా భోజనం పెడుతున్నామని తెలిపారు. అయితే భక్తుల కోరికను దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదిస్తామని, వారి అనుమతి మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్రతాల్లో ఇస్తున్న జాకెట్టు ముక్క చిన్నదిగా ఉందని, వ్రత గావంచా మీద బియ్యం తక్కువ వేస్తున్నారని బిక్కిన విశ్వేశ్వరరావు (కాకినాడ) చెప్పారు. గతంలో సత్యదేవుని శాశ్వత కల్యాణ పథకానికి రూ.8 వేలు చెల్లించానని, ప్రస్తుతం తన పేరిట కల్యాణం జరుగుతున్నట్టు తనకు సమాచారం రావడం లేదని ఇమ్మడిశెట్టి రామకృష్ణ (రాజానగరం) తెలిపారు. శాశ్వత పథకాల పరిమితిని పదేళ్లకు మార్చామని ఈఓ తెలిపారు. బాండ్ తెస్తే పరిశీలించి, పూర్తి వివరాలు తెలియజేస్తానని చెప్పారు. రత్నగిరిపై భక్తులకు రాత్రి వేళ కూడా ప్రథమ చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని వీరేంద్ర (తుని) కోరారు. ఉత్తరాది భక్తుల కోసం రత్నగిరిపై హిందీలో బోర్డులు ఏర్పాటు చేయాలని కృష్ణబాబు (పెద్దనాపల్లి), రైల్వేస్టేషన్ రోడ్డులో దేవస్థానం మైకులు ఏర్పాటు చేసి, భక్తి గీతాలు ప్రసారం చేయాలని కృష్ణ (అద్దరిపేట) కోరారు. ఇంకా పలువురు భక్తులు వివిధ సమస్యలను ప్రస్తావించారు. కార్యక్రమంలో దేవస్థానం ఏసీ రమేష్ బాబు, ఏఈఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఆరు నెలల జైలు, రూ.9 లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పి.భరద్వాజ్ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ వాకలపూడికి చెందిన కొవ్వూరి పద్దారెడ్డి వద్ద ప్రత్తిపాడుకు చెందిన మాదినే గంగాధరరావు వ్యాపార నిమిత్తం 2020లో రూ.11 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు 2021లో రూ.9 లక్షల చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును పద్దారెడ్డి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు విచారణలో గంగాధరరావుపై నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.